# గ్రూప్-1కు బ్రేక్!

మొదటిపేజీ తరువాయి...

అనేక అనుమానాలను రేకెత్తిస్తున్నదని అన్నారు. ఇక 482 మార్కులు వచ్చిన ఒక అభ్యర్థి ఇంకా ఎక్కువ మార్కులు వస్తాయని రీకౌంటింగ్ చేయించుకుంటే అవి 422కు తగ్గిపోయాయని తెలిపారు. జనరల్ ర్యాంకింగ్ లిస్ట్‌లో పబ్లిష్ చేయడానికి కంప్యూటర్స్‌లో మార్పులు చేశారని, లాగ్ హిస్టరీ పరిశీలిస్తే ఈ బాగోతం బట్టబయలు అవుతుందని చెప్పారు. దీనిపై అడిగితే ఫోర్జరీ అని చెప్తున్నారని, ఇదే నిజమైతే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని, ఇవన్నీ గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని చెప్పడానికి కీలక అంశాలని తెలిపారు.

**కొత్తగా 10 మంది ఎక్కడినుంచి వచ్చారు?**

గ్రూప్-1 మెయిన్‌కు 21,075 మంది హాజరయ్యారని, ఆ తర్వాత తుది జాబితాలో ఆ సంఖ్య 21,085కు పెరిగిందని, కొత్తగా పది మంది ఎక్కడి నుంచి వచ్చారనే ప్రశ్నకు జవాబు లేదని రచనారెడ్డి చెప్పారు. గ్రూప్-1లో అక్రమాలు జరిగాయని చెప్పడానికి ఇంతకంటే మరో సాక్ష్యం అవసరం లేదని అన్నారు. ఉర్దూలో 9 మంది పరీక్ష రాశారని ప్రకటించిన కమిషన్ ఆ తర్వాత ఆ సంఖ్యను 10 మంది అని చెప్పడం కూడా కూడా అలాంటి అక్రమమేనని అన్నారు. ఇది ఎంతోకాలం గ్రూప్-1 పోస్టులను సాధించాలన్న నిరుద్యోగుల కలలను కల్లలు చేయడమేనని చెప్పారు. దేశంలోని వివిధ ప్రభుత్వ కాలేజీల్లోని నిపుణులైన ప్రొఫెసర్లతో మూల్యాంకనం చేయిస్తామని సర్వీస్ కమిషన్ చెప్పిందని, తీరా రిటైర్ అయిన వాళ్లతో చేయించిందని తెలిపారు. పదవీ విరమణ చేసినవారితో మూల్యాంకనం ఎందుకు చేయించిందీ సర్వీస్ కమిషన్ వివరణ ఇవ్వాలేదని అన్నారు. రిటైర్ అయిన వారిలో ప్రొఫెసర్ పీ నర్సయ్య కూడా ఉన్నారని, ఆయన 2004లో పదవీ విరమణ చేశారని, అలాంటి వాళ్లకు తెలంగాణ ఉద్యమ పరిణామాలపై పూర్తిస్థాయిలో అవగాహన ఎలా ఉంటుందని ప్రశ్నించారు. మల్లిక్ అనే ప్రొఫెసర్ ప్రైవేటు సంస్థ నుంచి కూడా వేతనం పొందుతున్నారని, ఆయన మూల్యాంకనం చేస్తే రాగద్వేషాలకు అతీతంగా ఉంటుందని ఎలా భరోసా ఇవ్వగలరని సందేహం వ్యక్తంచేశారు. ప్రిలిమ్స్‌కు, మెయిన్‌కు హాల్ టికెట్ల నంబర్లు వేర్వేరుగా ఇవ్వడంలో కూడా కావాలని తప్పులు చేశారని ఆరోపించారు. తొలుత 45 సెంటర్లని ప్రకటించి ఆ తర్వాత 46 సెంటర్లలో పరీక్షలు నిర్వహించారని, రెండు సెంటర్లల్లో పరీక్షలు రాసిన వారిలో 71 మంది అర్హత సాధించడం వెనుక దాగిన 'ప్రతిభ' ఏమిటో తేలాల్సివుందని అన్నారు. ఈ విషయాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని గ్రూప్-1 నియామక ప్రక్రియను నిలిపివేయాలని కోరారు.

**రెండు సెంటర్లలోనే 71 మంది ఎంపిక నిజమే: టీజీపీఎస్సీ**

టీజీపీఎస్సీ తరపు న్యాయవాది పీ రాజశేఖర్ ప్రతివాదన చేస్తూ, తప్పుడు వివరాలతో నియామకాల నిలుపుదలకు జరుగుతున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు. పిటిషనర్లలో 20 మందిలో 19 మంది ప్రభుత్వ ఉద్యోగులేనని, వాళ్లు ఎక్కడ పనిచేసేదీ వివరాలు సమర్పించలేదని తెలిపారు. వివరాలు లేని పిటిషన్ దాఖలు చేయడం సరికాదని అన్నారు. గ్రూప్-1 పోస్టులకు 2014 నుంచి నియామకాలు జరగలేదని, ఉద్యోగాలు చేస్తున్న పిటిషనర్లు నిరుద్యోగుల అవకాశాలను దెబ్బతీస్తున్నారని చెప్పారు. రీకౌంటింగ్‌లో ఒక అభ్యర్థి మార్కులు తగ్గాయనడం వాస్తవం కాదని, తొలుత 422.5 మార్కులు వచ్చాయని, రీకౌంటింగ్‌లో కూడా అవే మార్కులు వచ్చాయని తెలిపారు. అయితే మార్కులను 49 వస్తే 69, 77 వస్తే 87, 62.5 వస్తే 82.5 ఈ తరహాలో ఫోర్జరీ చేశారని చెప్పారు. ఈ వ్యవహారంపై సర్వీస్ కమిషన్ విచారణ చేపట్టిందని, షోకాజ్ నోటీసులు కూడా జారీ అయ్యాయని తెలిపారు. వారిపై ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక పరీక్ష కేంద్రంలో వికలాంగులకు అనుకూలంగా లేకపోవడం వల్ల మరో సెంటర్ అదనంగా ఏర్పాటు చేశామని చెప్పారు. కోఠి ఉమెన్స్ కాలేజీలో ఏర్పాటుచేసిన రెండు సెంటర్లలో ఎక్కువమంది ఎంపికయ్యారని అంగీకరించారు. పరీక్ష కేంద్రం 18లో 792కి గాను 39 మంది, మరో ఎగ్జామ్ సెంటర్ 19లో 864కుగాను 32 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఇది కేవలం నాలుగు శాతం కంటే తక్కువని అన్నారు. ఇదే సెంటరులో మిగిలిన అభ్యర్థులెవరూ అక్రమాలు జరిగాయని ఫిర్యాదు చేయలేదని, ఈ విషయాన్ని కోర్టు పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు. కోఠి మహిళా కళాశాలలో ఇన్విజిలేటర్లు, సిబ్బంది అందరూ మహిళలే కావడంతో కాలేజీ అభ్యర్థన మేరకు అక్కడ కేవలం మహిళా అభ్యర్థులే పరీక్ష రాసినట్టు చెప్పారు. మహిళా కాలేజీలో టాయిలెట్లను వినియోగించాల్సి ఉంటుందని, అక్కడ పురుషులను అనుమతిస్తే రహస్య కెమెరాలు వంటి సమస్యలు తలెత్తకుండా కమిషన్ ఈ నిర్ణయం తీసుకుందని వివరించారు. సెంటర్ల ఎంపిక పూర్తిగా జిల్లా కలెక్టర్లే చేస్తారని చెప్పారు. మెయిన్‌లో పురుషుల కంటే మహిళలు బాగా పరీక్ష రాశారని తేలిందని అన్నారు. హాల్‌టికెట్ల నంబర్లు మారినప్పటికీ ప్రతి మెయిన్ హాల్ టికెట్‌లో ప్రిలిమ్స్ హాల్‌టికెట్ నంబరును పేర్కొన్నట్టు చెప్పారు. ఐదు లక్షల మంది ప్రిలిమ్స్ రాయగా, 21 వేల మంది మెయిన్‌కు ఎంపికయ్యారని, వీళ్లకు వరుస నంబర్లు కేటాయించడానికి వీలుగా హాల్ టికెట్ల నంబర్లకు ప్రత్యేక సీరియల్ ఇచ్చినట్టు చెప్పారు.

**పది మంది పెరగడం స్వల్పమే**

పరీక్ష కేంద్రాల నుంచి వచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు 21,075 మంది పరీక్ష రాసినట్టు మీడియాకు వెల్లడించడం జరిగిందని, ఆ తర్వాత బయోమెట్రిక్ ఆధారంగా కచ్చితమైన వివరాలు అందాక ఆ సంఖ్య 21,085కు పెరిగిందని వివరించారు. పది మంది పెరగడం అంటే అది స్వల్పమేనని అన్నారు. ఆర్సీ రెడ్డి స్టడీ సర్కిల్‌లో పనిచేస్తున్న జీప మల్లిక్‌ను మూల్యాంకనం కోసం ఎంపిక చేశామనే అభియోగం అవాస్తవమని చెప్పారు. మల్లిక్ చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లెక్చరర్‌గా చేస్తున్నారని, అంబేద్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రొఫెసర్‌గా రిటైర్ అయిన నర్సయ్య అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని మూల్యాంకనం కోసం వినియోగించుకున్నామని చెప్పారు. పదవీ విరమణ చేసినవారు మూల్యాంకనం చేయకూడదనే రూల్ ఎక్కడా లేదని అన్నారు. ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తి మాట్లాడిన విషయాలే పిటిషన్‌లో ఉన్నాయని తెలిపారు. గ్రూప్-1 అభ్యర్థులకు ఏవిధంగానూ అన్యాయం జరగలేదన్నారు. వాదనల తర్వాత హైకోర్టు, గ్రూప్-1 నియామకాలు చేపట్టరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. అయితే, నియామక ప్రక్రియలో భాగంగా సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవచ్చునని చెప్పింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది.

**మూల్యాంకన నిబంధనలకు తిలోదకాలు**

గ్రూప్-1 పరీక్ష ఫలితాలు ఈ నెల 10న విడుదలయ్యాయి. తెలుగు మీడియం వారికి అన్యాయం జరిగిందని అభ్యర్థుల అభియోగం. ఈ తరుణంలో పరీక్ష పేపర్లను రీవాల్యుయేషన్ జరిపించాలని అభ్యర్థులు హైకోర్టును కోరారు. 'గ్రూప్-1 మూల్యాంకనం లోపభూయిష్టంగా జరిగింది. మొత్తం18 రకాల సబ్జెక్టులు ఉంటే 12 సబ్జెక్టుల పేపర్లను నిపుణులతోనే దిద్దించారు. తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ మూడు భాషల్లో పరీక్ష నిర్వహించారు. వాటిని తగిన నిపుణులతో దిద్దించలేదు. ఒకే మాధ్యమంలో నిపుణులైన వారితో ఇంగ్లిష్, తెలుగు మీడియం పేపర్లు మూల్యాంకనం చేయించారు. వారిలో చాలా మందికి తెలుగు, ఉర్దూ తెలియదు. ఈ కారణంగా తెలుగు, ఉర్దూ భాషలలో పరీక్షలు రాసిన అభ్యర్థులు మార్కులను కోల్పోయే ప్రమాదం ఉంది. రాష్ట్రం వెలుపల నుంచి వచ్చిన నిపుణులకు తెలంగాణ ఉద్యమం, స్థానిక చరిత్ర వంటి అంశాలపై అవగాహన ఉండదు. నిబంధనలకు తిలోదకాలిచ్చి చేసిన మూల్యాంకనం వల్ల తెలుగు మీడియం అభ్యర్థులకు తీరని అన్యాయం జరిగింది. కాబట్టి గ్రూప్-1 మెయిన్ పరీక్ష జవాబు పత్రాలను తిరిగి మూల్యాంకనం చేయాలి. ఆ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు ఆదేశాలివ్వాలి. అప్పటివరకు తదుపరి నియామక ప్రక్రియపై స్టే ఇవ్వాలి' అని కోరుతూ ఖమ్మంకు చెందిన ఎస్ నరేశ్‌తోపాటు మరో 22 మంది పిటిషన్లు దాఖలు చేశారు.

**ఎస్టీ రిజర్వేషన్ల పెంపు కేసులోనూ..**

గ్రూప్-1 పోస్టుల నియామకాల్లో ఎస్టీ రిజర్వేషన్లను ఆరు శాతం నుంచి పది శాతానికి పెంపుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గతంలోనే హైకోర్టులో పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తమ ముందున్న వ్యాజ్యాలపై తుది ఉత్తర్వులు వెలువడేలోగా ప్రభుత్వం గ్రూప్-1 పోస్టుల భర్తీలో ఎస్టీ రిజర్వేషన్లను పెంపుదల నిర్ణయాన్ని అమలు చేస్తే అవి తామిచ్చే తుది తీర్పుకు లోబడి ఉంటాయని ఈ నెల 10న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో తదుపరి విచారణ జూన్ 12న జరగనుంది.




# ఎన్ఈపీ-2020 తెలంగాణకు గొడ్డలిపెట్టు

**నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీపై సెమినార్‌లో వక్తలు**

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తేతెలంగాణ): కేంద్రం రూపొందించిన జాతీయ విద్యావిధానం తెలంగాణ అస్థిత్వానికి గొడ్డలిపెట్టు లాంటిదని పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఎస్సీఈఆర్టీ) ఆఫీసులో తెలంగాణ విద్యాక మిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో ఎన్ఈపీ-20పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఇందులో ప్రొఫెసర్లు హరగోపాల్, శాంతాసిన్హా, కోదండరాం, రామమేల్కోటి పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ అవసరాలకు తగినట్టుగా ప్రత్యేక విద్యావిధానాన్ని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉన్నదని కోదండరాం అభిప్రాయపడ్డారు. మన సంస్కృతి, చరిత్ర ప్రత్యేకమని, ఎన్ఈపీతో మన సంస్కృతి కనుమరుగయ్యే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. శాంతసిన్హా మాట్లాడుతూ విద్య అనేది పౌరుల ప్రాథమిక హక్కు అనే విషయాన్ని కేంద్రం విస్మరించిందని ఆరోపించారు. సమగ్రంగా చర్చించకుండానే దొడ్డిదారిన రాష్ర్టాలపై రుద్దే కుట్ర జరుగుతున్నదని విమర్శించారు. ప్రజాస్వామిక వాదులు జాతీయ విద్యావిధానాన్ని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. లేదంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించబోవని స్పష్టంచేశారు. గ్రామీణ విద్యను పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉన్నదని ప్రొఫెసర్ రమా మేల్కోటి పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు అంగన్‌వాడీలకు వేతనాలిచ్చే స్థితిలో లేకపోవడం దురదృష్టకరమని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎలాంటి పాలసీలు తెచ్చిన నిష్ప్రయోజనమేనని వ్యాఖ్యానించారు.

# హెచ్ఆర్సీ చైర్మన్‌గా షమీమ్‌అక్తర్ బాధ్యతలు



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) చైర్మన్‌గా నియమితులైన జస్టిస్ షమీమ్‌అక్తర్ గురువారం నాంపల్లిలోని టీజీహెచ్ఆర్సీలో బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్‌తోపాటు, కమిషన్ సభ్యులు జిల్లా రిటైర్డ్ న్యాయమూర్తి ప్రవీణ, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ బీ కిశోర్ బాధ్యతలు స్వీకరించారు.

# ఇది అభ్యర్థుల విజయం

- హైకోర్టు ఆదేశాలు సర్కారుకు చెంపపెట్టు
- గ్రూప్-1 నియామకాల్లో అవకతవకలు
- అభ్యర్థులు, బీఆర్ఎస్ వాదనకు బలం చేకూర్చేలా కోర్టు ఆదేశాలు : రాకేశ్‌రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలని టీజీపీఎస్సీని హైకోర్టు ఆదేశించడం సంతోషకరమని, గ్రూప్-1లో అవకతవకలు జరిగాయన్న అభ్యర్థులు, బీఆర్ఎస్ వాదనకు కోర్టు ఉత్తర్వులతో బలం చేకూరిందని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. తుది తీర్పు వెలువరించేవరకు నియామకాలను చేపట్టవద్దని ధర్మాసనం ఆదేశించడం రేవంత్ సర్కారుకు చెంపపెట్టు అని గురువారం ఓ ప్రకటనలో అభివర్ణించారు. అంతిమ విజయం ధర్మానిదేనన్న విషయం మరోసారి నిరూపితమైందని, ఇది అభ్యర్థులు సాగించిన ఉద్యమానికి అండగా నిలిచిన బీఆర్ఎస్ నైతిక విజయమని తెలిపారు. అక్రమాలు జరిగాయని తాను ఆధారాలతో బయటపెడితే బెదిరింపులకు దిగిన టీజీపీఎస్సీ బండారం హైకోర్టు తీర్పుతో బట్టబయలైందని విమర్శించారు. 16 నెలల కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు జరిగిన అన్యాయాన్ని బీఆర్ఎస్ మొదటి నుంచీ ఎండగడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులే తమవారికి ఉద్యోగాలిప్పించుకొనే విషయంపై చర్చించుకుంటున్నారు. శ్రీధర్‌బాబు, కొండా సురేఖ మాటామంతి అభ్యర్థుల్లో మరిన్ని అనుమానాలు రేకెత్తిస్తున్నది. ఇదే పద్ధతిలో గ్రూప్-1 ఫలితాలు వచ్చినయ్' అని ధ్వజమెత్తారు. న్యాయం జరిగేదాకా అభ్యర్థులతో కలిసి బీఆర్ఎస్ అలుపెరగని పోరాటం చేస్తుందని స్పష్టంచేశారు.

# గ్రూప్-1లో మళ్లీ ఇంటర్వ్యూ?

- టీజీపీఎస్సీకి నిపుణుల కమిటీ సూచన
- పోటీ పరీక్షల సిలబస్‌లో 10 -15% మార్పులు
- సిలబస్ కమిటీ చైర్మన్‌గా ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 17 (నమస్తే తెలంగాణ): గ్రూప్-1 ఉద్యోగాలకు సంబంధించిన నియామకాల్లో ఇంటర్వ్యూలను పునరుద్ధరించే అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలని కొందరు నిపుణులు టీజీపీఎస్సీకి సూచించారు. దీనిపై అధ్యయనం చేసేందుకు టీజీపీఎస్సీ ఓ కమిటీని నియమించింది. పోటీ పరీక్షల సిలబస్ రూపకల్పన, సంస్కరణలపై చర్చించేందుకు టీజీపీఎస్సీ బుధవారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. రాష్ట్రంలోని అన్ని వర్సిటీల వైస్‌చాన్స్‌లర్లు హాజరయ్యారు. ఇందులో గ్రూప్-1లో తిరిగి ఇంటర్వ్యూలను ప్రవేశపెట్టాలన్న అంశంపై చర్చించినట్టు సమాచారం. పలువురు వీసీలు, నిపుణులు ఇంటర్వ్యూ విధానాన్ని పునరుద్ధరించాలని సూచించినట్టు తెలిసింది. దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాల్లో గ్రూప్-1లో ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నారని, మన రాష్ట్రంలో సైతం పునరుద్ధరించాలనే అభిప్రాయం వ్యక్తమైనట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. ఇంటర్వ్యూ విధానంతో అన్యాయం, వివక్షకు దారితీస్తున్నదని, పారదర్శకంగా నియామకాలు జరగడంలేదని భావించిన గత కేసీఆర్ సర్కారు 2022లో గ్రూప్-1 సహా అన్ని నియామకాల్లో ఇంటర్వ్యూలను రద్దు చేసింది. రాతపరీక్షలో సాధించిన మార్కుల ద్వారానే నియామకాలు చేపట్టాలని నిర్ణయించింది. అయితే గతంలో గ్రూప్-2, జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టుల భర్తీలో ఇంటర్వ్యూలుండేవి. గ్రూప్-1లో ఇంటర్వ్యూలను పునరుద్ధరిస్తే, వీటికి కూడా పునరుద్ధరిస్తారా? అన్న చర్చలు నడుస్తున్నాయి.

**పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు!**

పోటీ పరీక్షల సిలబస్‌లో మార్పులు, చేర్పులపై టీజీపీఎస్సీ దృష్టిసారించింది. ప్రస్తుతం ఉన్న సిలబస్‌లో సుమారు 10-15% సిలబస్‌ను మార్చేందుకు సిద్ధమవుతున్నది. సిలబస్‌లో కొన్ని వర్తమాన అంశాలను చర్చే దిశగా కసరత్తు చేస్తున్నది. ఇందుకోసం ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ఆరుగురు సభ్యులతో కమిటీని నియమించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 2014-15లో కమిటీ వేసి సిలబస్‌ను రూపొందించారు. నాడు ఈ కమిటీలో ఉన్న ప్రొఫెసర్లు హరగోపాల్, కోదండరాం, చుక్కా రామయ్య తదితరులు సమగ్ర అధ్యయనం చేసి, సిలబస్‌ను రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. అయితే పదేండ్లు పూర్తికావడంతో సిలబస్‌లో మార్పులు చేయాలని టీజీపీఎస్సీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 తోపాటు ఇతర పోటీ పరీక్షల సిలబస్‌లో స్వల్ప మార్పులను కమిటీ సిఫారసు చేయనున్నది. ప్రశ్నావళి, సాంకేతిక సంస్కరణలపై కూడా మరో రెండు కమిటీలు ఏర్పాటయ్యాయి.








